సాక్షి
చిత్తూరు
బుధవారం । 8 । జనవరి । 2025



పాడి పరి'శ్రమే'

చిత్తూరు జిల్లాలో పాడి రైతులకు పశుపోషణకు ఇచ్చే పథకాలకు బ్యాంకర్లు మోకాలడ్డుతున్నారు. - IIలో



అథ్లెటిక్స్ మీట్ ప్రారంభం

చౌడేపల్లె మండలం పుదిపట్ల పాఠశాలలో పుంగనూరు జోనల్ అథ్లెటిక్ మీట్ ప్రారంభించారు. - IIలో



192 మంది అర్హత

కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో భాగంగా నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షల్లో 192 మంది అర్హత సాధించారు. - IIలో

న్యూస్‌రీల్

ప్రజాభిప్రాయ సేకరణ ప్రారంభం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ టారిఫ్ పెంపుపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ప్రారంభమైంది. మంగళవారం ఎస్‌ఈ కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఏఓ, ఈఈలు హాజరయ్యారు. విజయవాడ నుంచి ఏపీఈఆర్సీ ఇన్‌చార్జ్ చైర్మన్ రాంసింగ్ ఇతర అధికారులు మాట్లాడారు. విద్యుత్ సంస్థలు నష్టాల్లో ఉన్నాయని, నష్టాలు భర్తీ కోసం చార్జీలు పెంపు అవసరమని ఉన్నతాధికారులు తెలిపారు. పలు రంగాలకు సబ్సిడీ రూపంలో విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. అలాగే పెరిగిన బొగ్గు భారం, జీత భత్యాలు, పరికరాల ఖరీదు తదితర అంశాల కారణంగా పెంపు అవసరమన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ముగిసిన తర్వాత తరువాత నిర్ణయం తెలియజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ ప్రసన్న ఆంజనేయులు, ఈఈలు మునిచంద్ర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

18న నవోదయ ప్రవేశ పరీక్ష

– డీఈఓ వరలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 26 పరీక్ష కేంద్రాల్లో ఈ నెల 18వ తేదీన నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈఓ వరలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు జవహర్ నవోదయ విద్యాలయాల ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు www.navodaya.gov.in వెబ్‌సైట్‌లో హాల్ టికెట్, అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. సంబంధిత పరీక్ష కేంద్రాల్లో 18న ఉదయం 10.45 నుంచి 11.30 గంటల వరకు విద్యార్థులను అనుమతిస్తారన్నారు. 11.30 గంటల తర్వాత అనుమతి ఉండదని స్పష్టం చేశారు. పరీక్ష 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు నిర్వహిస్తారన్నారు. హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌లో ఏవైనా సమస్యలున్నట్లయితే విద్యార్థులు హెల్ప్‌లైన్ 8919956395, 9491832148 నంబర్లలో సంప్రదించాలన్నారు.

విజనరీ భజన



కుప్పానికి వచ్చిన ప్రతిసారీ చంద్రబాబునాయుడు అవే హామీలు.. అవే మాటలతో గారడీ చేస్తున్నారు. దాదాపు 35 ఏళ్లగా కుప్పం ఎమ్మెల్యేగా గెలిపిస్తున్నా ఆయన తన నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ అభివృద్ధిని చేయలేకపోయారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రిని చేసినా కుప్పానికి కనీసం తాగు, సాగునీరు కూడా ఇవ్వలేకపోయారు. గతంలో విమానాశ్రయ మంటూ ఊదరగొట్టారు. ఇజ్రాయిల్ వ్యవసాయమని నమ్మించి వంచించారు. ఇప్పుడు విమానాల రిపేర్లు చేసే పరిశ్రమ వస్తుందని, సేంద్రియ వ్యవసాయాన్ని తీసుకొస్తామని వరాల వాన కురిపించారు. ఆయన బురిడీ మాటలు నమ్మలేమని కుప్పం ప్రజలు చర్చించుకుంటున్నారు.

బాబు బడాయి

- 2020 నుంచి 2047కు వెళ్లిన చంద్రన్న విజన్
- 1995 నుంచి అవే మాటలు.. అవే హామీలు
- నాడు హంద్రీ నీరు అన్నారు.. నేడు గోదావరి అంటున్నారు
- కుప్పం విమానాశ్రయం శంకుస్థాపనకే పరిమితం
- ఇజ్రాయిల్ సేద్యం పాయె... ఆర్గానిక్ సేద్యం వచ్చే
- కుప్పానికి 35 ఏళ్లుగా అవే వరాలు

హామీల కుప్పం

- కుప్పం నియోజకవర్గంలో మండలానికో పరిశ్రమ ఏర్పాటు
- వంద శాతం సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం. నెలకు రూ.30వేల నుంచి రూ.40 వేలు ప్రతి రైతుకూ ఆదాయం.
- ఇంటికో పారిశ్రామిక వేత్తను తయారు చేయడం
- ప్రతి ఒక్కరికీ సొంతిల్లు
- బెంగళూరుకు మించి అభివృద్ధి
- బెంగళూరు పిల్లలు కుప్పంలో చదువు, ఉద్యోగం చేసుకునే విధానం తీసుకురావడం
- ప్రపంచ స్థాయి ఎడ్యుకేషన్
- దేశానికే కుప్పాన్ని ఆదర్శం చేయడం
- రెండున్నరేళ్లల్లో నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికీ అందమైన రోడ్లు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: సీఎం చంద్రబాబు విజనరీ విని కుప్పం ప్రజలు నవ్వుకుంటున్నారు. ఓట్ల కోసమే తప్ప కుప్పం అభివృద్ధిని ఆయన ఎప్పుడూ కాక్షించలేదని పలువురు చర్చించుకుంటున్నారు. 1995 సెప్టెంబర్ 1న మొదటి సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు విజన్ 2020 తీసుకొచ్చారు. ఉమ్మడి రాష్ట్రాన్నే కాకుండా కుప్పాన్ని కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామంటూ నమ్మబలికారు. 2020 అయితే పూర్తయింది కానీ

ఇజ్రాయిల్ పోయింది..ఆర్గానిక్ తెస్తారంట

1999లో రెండోసారి ముఖ్యమంత్రిగా కుప్పం పర్యటనకు వచ్చిన చంద్రబాబు ఇజ్రాయిల్ వ్యవస్థ ద్వారా బిందు, తుంపర్ల సేద్యం తీసుకొచ్చారు. ఈ సేద్యంలో మొదట్లోన్నే అవినీతి, అక్రమాలు చోటు చేసుకోవడంతో త్రీకే ఆర్ వరకు వచ్చి ఆగిపోయింది. ప్రస్తుత పర్యటనలో పూర్తి స్థాయిలో ఆర్గానిక్ వ్యవసాయం (సేంద్రియ వ్యవసాయం) అంటున్నారు. ఇది ఎంతవరకు కార్యరూపం దాలుస్తుందో అని రైతుల్లో అనుమానాలు నెలకొన్నాయి. ఈ పథకాల్లో మెజార్టీ శాతం టీడీపీ నాయకులకే లబ్ధి జరుగుతుండడంతో సాధారణ రైతులు పెదవి విరుస్తున్నారు.

చంద్రబాబు హామీలు మాత్రం అమలుకు నోచుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు.

గోదావరి నీరు తెస్తారంట?

కుప్పం నియోజకవర్గంలో తాగు, సాగునీటికి ఇప్పటికీ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల అవసరాలను ఓట్లుగా మలచుకునేందుకు చంద్రబాబు తన ప్రతి పర్యటనలోనూ ఆ నది నీరు తెస్తా... ఈ నది నీళ్లు ఇస్తా..? అంటూ మాటలకే పరిమితమవుతున్నారు. ఇప్పటికీ కుప్పం నియోజకవర్గ ప్రజల తాగు, సాగునీటికి ఆకాశం వైపు చూడాల్సి వస్తోంది. తాజాగా గోదావరి నీరు తీసుకొస్తానని చెప్పుకొచ్చారు.

పరిశ్రమలెక్కడ బాబూ?

కుప్పం నుంచి ఎన్నికైన చంద్రబాబు నియోజకవర్గ ప్రజలకు మొట్టమొదటి హామీ పరిశ్రమలను తీసుకొచ్చి పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తానని గొప్పగా ప్రకటించారు. జనం కూడా ఆయన మాటలను నమ్మారు. అయితే ఇప్పటికీ చెప్పుకోదగ్గ పరిశ్రమలు తీసుకురాలేకపోయారు. చిన్న తరహా ఆర్‌బీఏ, షాహీ పరిశ్రమలను తీసుకొచ్చారు. వాటిల్లో మొత్తం కలిపితే 2వేల మంది పనిచేస్తుంటారు. అందులోనూ స్థానికేతరులే అధికం. కొన్ని పరిశ్రమలు ఎంఓయూలు చేసుకుని, స్థలాలు కేటాయించినా కార్యరూపం దాల్చలేకపోయాయి. తాజాగా మంగళవారం మరో రెండు చిన్న తరహా పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు. ఇవి ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి. ఫలితంగా ఉపాధి కోసం కుప్పం ప్రజలు కర్ణాటక, తమిళనాడు బాట పడుతున్నారు. నిత్యం సుమారు పది వేల మందికి పైగా స్థానికులు ఉపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు వెళ్తున్నారు.

విమానం పాయె.. రిపేర్లుకొచ్చే!

మూడవ మారు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేసి కుప్పం పర్యటనకు వచ్చిన సందర్భంగా కుప్పంలో విమానాశ్రయం నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. పదేళ్లు కావస్తున్నా ఇప్పటికీ పునాది రాయి పడలేదు. దీంతో విమానాశ్రయం కూడా వస్తుందా... రాదా? అంటూ కొంతమంది చర్చించుకుంటున్నారు. సోమ, మంగళవారాల్లో కుప్పం పర్యటనల్లో విమానాశ్రయాల రిపేర్ల వ్యవస్థను కుప్పానికి తీసుకొస్తానని చెప్పడం గమనార్హం.

చెప్పినట్టు వినాల్సిందే... లేకుంటే మార్చేస్తాం



ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాజేంద్ర

విజయపురం : అధికారులు మేము చెప్పింది వినాల్సిందేనని టీడీపీ నేతలు హుకుం జారీ చేస్తున్నారు. దీంతో అధికారులు నిత్యం ఒత్తిడికి గురవుతున్నారు. ఒత్తిడిని అధిగమించి ఎవరైనా టీడీపీ నేతల మాట వినకుంటే వెంటనే ఆ అధికారులను తమ అధికార బలంతో మార్చేస్తున్నారు. దీనికి విజయపురం ఇన్‌చార్జి ఎంపీడీఓను మార్చి మరొకరికి ఇన్‌చార్జి అప్పగించడమే సాక్ష్యంగా నిలుస్తోంది. ఎన్నికల అనంతరం విజయపురం ఎంపీడీఓగా ఉన్న చంద్రమౌళి కార్వేటినగరం మండలానికి బదిలీ అయ్యారు. దీంతో నగరి ఈఓపీఆర్‌డీ అరుణమ్మకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అయితే రాత్రికి రాత్రే టీడీపీ నాయకులు ఆ ఆర్డర్లను రద్దు చేయించి, విజయపురం ఏఓ రమణప్రసాద్‌కు బాధ్యతలు అప్పగించారు. మూడు నెలలు తిరగక ముందే వారి మోజు తీరిపోయింది. చెప్పినవన్నీ చేయడం లేదని ఎంపీడీఓపై అక్కసు పెంచుకున్నారు. అంతే ఆయన స్థానంలోకి ఈఓపీఆర్డీ రాజేంద్ర ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అయిపోయారు. మండలంలో 20 వేల మంది జనాభాకు సేవలు అందించే కీలకమైన ఎంపీడీఓ పోస్టుకు నిత్యం ఒకరు మారుతుండడంతో జనం విస్తుపోతున్నారు. మూడు నెలలకే ముగ్గురు ఎంపీడీఓలు మారడం ఇక్కడ అధికార పార్టీ వ్యవహార శైలికి అద్దం పడుతోంది. ఇప్పుడు ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన వారు ఎన్ని నెలలుంటారో అంటూ చెవులు కొరుక్కుంటున్నారు. నిబంధనల ప్రకారం పని చేస్తే..మార్చేడం ఖాయమని, స్వామి భక్తి చూపిస్తేనే కొనసాగే వీలుంటుందని బాహాటంగా చెప్పుకుంటున్నారు.

విద్యార్థినిని చితకబాదిన ఉపాధ్యాయుడు

– చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

పుంగనూరు: మండలంలోని ఏడూరు పాఠశాలలో పనిచేసే టీచర్ గణేష్, ఐదో తరగతి చదువుతున్న బాలికను చితకబాదిన సంఘటన సోమవారం జరిగింది. మంగళవారం ఈ మేరకు బాలిక తండ్రి సుధాకర్ ఎంఈఓ రెడ్డెన్నశెట్టికి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక తండ్రి కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఓ బాలిక స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. రోజులాగే ఆమె సోమవారం స్కూలుకు వెళ్లింది. టీచర్ గణేష్ అకారణంగా బాలిక చెవి, చెంపల పైన కొట్టి గాయపరిచాడు. రాత్రి బాలికకు తీవ్రమైన జ్వరం, చెవి నొప్పి వచ్చింది. ఏమి జరిగిందని తల్లిదండ్రులు ప్రశ్నించడంతో ఆమె విషయం తెలిపింది. దీంతో వారు బాలికను ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఉపాధ్యా యుడి పై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళన చేస్తామని తల్లిదండ్రులు, ప్రజలు తెలిపారు. ఎంఈఓ మాట్లాడుతూ దీనిపై విచారణ జరిపి, చర్యలు తీసుకుంటామన్నారు.



ఎంఈఓకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థిని, ఆమె తండ్రి

ఊతమిస్తేనే.. ఊపిరొచ్చేది!

కన్నీటిని మింగుతున్న కరువుజీవులం..కష్టాలను ఓర్చుకుంటున్న కర్షకులం..పసిడి నేలలున్నా పట్టెడన్నం కరువుతో అల్లాడుతున్నాం.. పథకాలందని బడుగుజీవులం.. కాయకష్టంతో కొండలనే కరిగిస్తాం.. కన్నీళ్లను తుడిచే దారులు వెతుకుతున్నాం.. మేమే చిత్తూరు జిల్లా వాసులం.. నేడు జిల్లాకు వస్తున్న కరువు నిర్ధారణ బృందం నిర్ణయంపైనే మాకు ఊరట సాధ్యం. వారు ఊతమిస్తేనే.. మాకు ఊపిరి వస్తుందని ఆశిస్తున్నాం.



యాదమరి మండలంలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న స్థానిక వ్యవసాయాధికారులు(ఫైల్)

- జిల్లా వ్యాప్తంగా వేరుశనగపంట నష్టం
- కన్నీళ్లు మిగిల్చిన ఖరీఫ్
- అత్యంత కరువు మండలాలుగా యాదమరి, పెనుమూరు, గుడిపాల
- మధ్యస్థ కరువు మండలాలుగా 13
- సుమారు 9 వేల హెక్టార్లల్లో నష్టం
- నేడు యాదమరి మండలానికి కరువు బృందం రాక

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఖరీఫ్‌లో రైతులు వేలాది ఎకరాల్లో సాగు చేసిన వేరుశనగ పంట ఎండిపోయింది. పెట్టుబడి కూడా చేతికి చిక్కకుండా పోయింది. ఫలితంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 16 మండలాల్లోని 24,342 మంది రైతులు సుమారు 9 వేల హెక్టార్లల్లో సాగు చేసిన పంట దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. ఇందుకుగాను రూ.15.42 కోట్ల మేర పంట నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో జిల్లాలో అత్యంత కరువు మండలాలుగా మూడింటిని ఎంపిక చేశారు. మరో 13 మండలాలు మధ్యస్థ కరువు మండలంగా గుర్తించారు. ఈ కరువు పరిస్థితులను తెలుసుకునేందుకు బుధవారం కేంద్ర కరువు నిర్ధారణ బృందం యాదమరి మండలంలో పర్యటించనుంది.

ఖరీఫ్‌లో 13,044 హెక్టార్ల సాగు

జిల్లాలో ప్రధాన పంట వేరుశనగ. ఈ పంట వర్షాధారంగా సాగవుతోంది. జిల్లాలో సాధారణ విస్తీర్ణం 43,174 హెక్టార్లు కాగా 13,044 హెక్టార్లల్లో పంట సాగైంది. ఖరీఫ్ సాగు కోసం ప్రభుత్వం వేరుశనగ విత్తనాలను కూడా పంపిణీ చేసింది. తొలకరి చినుకులు కూడా రైతులను కాస్త ఊరించాయి. దీంతో రైతులు విత్తనం విత్తారు. ఆ తరువాత వరుణుడి జాడ కరువైంది. ఊడలు, కాయలు బలపడే సమయంలో చినుకు జాడ లేకుండాపోయింది. దీంతో రైతు చేతికి తీగలు కూడా దక్కలేదు. పంట దిగుబడి 5 వేల నుంచి 6 వేల మెట్రిక్ టన్నులు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. పెరిగిన పెట్టుబడికి... చేతికి వచ్చిన దిగుబడికి పొంతన లేకుండా పోయింది. దీంతో రైతులు ఆర్థికంగా నష్టాలను చవి చూడాల్సి వచ్చింది.

ప్రభుత్వానికి కరువు నివేదికలు

వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండిపోయిన వేరుశనగ పంట నష్టాన్ని అధికారులు అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదికలు పంపారు. గుడిపాల, యాదమరి, పెనుమూరు మండలాల్లో తీవ్ర కరువుగా గుర్తించారు. అలాగే మరో 13 మండలాలు మధ్యస్థ కరువు మండలంగా గుర్తించి, వివరాలు అందజేశారు. సుమారు 9 వేల హెక్టార్లలో వేరుశనగ పంట నష్టం జరిగినట్లు వివరించారు.

నేడు బృందం రాక

పంట నష్టం అంచనా వేయడానికి కేంద్ర కరువు నిర్ధారణ బృందం బుధవారం తొలుత యాదమరి మండలం కోణాపల్లి ప్రాంతంలో పర్యటించనుంది. ముగ్గురు అధికారులు ఖరీఫ్ పంట నష్టంపై ఆరా తీయనున్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు వారి క్షేత్ర పరిశీలన జరగనున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి చరిత తెలిపారు. కాగా యాదమరి మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం 1,217 హెక్టార్లు కాగా, 590 హెక్టార్లలో పంట సాగు అయ్యింది. మండలంలో 1,914 మంది రైతులు వేరుశనగ సాగు చేశారు. ఈ పంట పూర్తిగా దెబ్బతినింది. ఈ వివరాలను వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం సాయంత్రం పక్కాగా సిద్ధం చేశారు. నష్టపోయిన ప్రతి పంట వివరాలను నివేదికల రూపంలో తయారు చేసి ఉంచారు.

అనాథీనం.. దర్జాగా భోజ్యం



పుంగనూరు మున్సిపాలిటీ పిచ్చిగుండ్లపల్లి రహదారి వద్ద జగనన్న కాలనీ ఇళ్ల స్థలాలను పంపిణీ చేస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (ఫైల్)



పుంగనూరు-బెంగళూరు జాతీయ రహదారి వెంబడి టీడీపీ నాయకుడు ఆక్రమించిన భూమి

ఖాళీ జాగా కనిపిస్తే చాలు అది ఎలాంటిదైనా తమ ఖాతాలో వేసుకోవడానికి కొందరు నేతలు బరితెగిస్తున్నారు. ఈ క్రమంలో అడిగేవారు లేరని అనాదీనం పరాధీనం చేస్తున్నారు. అడ్డుకునేవారు లేరని పేదల ఇళ్ల స్థలాలు, ఇండోర్ స్టేడియంలను కబ్జా చేస్తున్నారు. వాటాలు పంచుకుని విక్రయించుకుంటున్నారు. ఇదీ పుంగనూరులోని కబ్జాల పర్వం.

- జగనన్న కాలనీలూ కబ్జా
- పుంగనూరు నియోజకవర్గంలో యథేచ్ఛగా టీడీపీ నేతల భూకబ్జాలు
- ఇప్పటివరకు రూ.20 కోట్ల విలువైన సుమారు 21 ఎకరాల ఆక్రమణ
- కొన్ని భూముల రికార్డులు మార్చి వేసి అమ్మకం
- అక్రమ ఆర్జనలో వాటాలు పంచుకుంటున్న నాయకులు
- పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం

సాక్షి టాస్క్‌ఫోర్స్: అనాదీనం భూములు.. పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు.. ఇండోర్ స్టేడియం.. ఇలా ఏదైనా ఖాళీగా కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారు. చదును చేసుకుని అమ్ముకుంటున్నారు. స్థాయి ఆధారంగా నాయకులు వాటాలు పంచుకుంటున్నారు. ఇదీ చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో ఆరు నెలలుగా టీడీపీ నాయకులు యథేచ్ఛగా సాగిస్తున్న భూ దందా. ఇప్పటివరకు సుమారు రూ.20 కోట్ల విలువైన సుమారు 21 ఎకరాల భూమిని కబ్జా చేశారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో టీడీపీ నాయకులు మరింత రెచ్చిపోతున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

భూముల కబ్జా విషయమై స్థానిక తహసీల్దార్ రామును 'సాక్షి' ఫోన్‌లో వివరణ కోరగా.. 'మేలుందొడ్డి గ్రామ దాఖలా సర్వే నంబర్ 256/10లో ఉన్న 9.35 ఎకరాలు అనాధీనం భూములే. ఆ భూములు ఆక్రమణలకు గురికాకుండా చూస్తాం. జగనన్న కాలనీల్లో స్థలాల దురాక్రమణపై కూడా విచారణ జరిపి, చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు.

ఆక్రమణల పర్వం ఇలా..

- పుంగనూరు నుంచి బెంగళూరుకు వెళ్లే జాతీయ రహదారి వెంబడి మేలుందొడ్డి గ్రామ దాఖలా సర్వే నంబర్ 256/10లో ఉన్న 9.35 ఎకరాల అనాధీనం భూమిని కబ్జా చేసేందుకు 2011లోనే టీడీపీ నాయకులు ప్రయత్నించారు. ఫోర్జరీ సంతకాలతో ఈ భూమి రికార్డులు మార్చి హస్తగతం చేసుకునేందుకు చేసిన కుట్రలను అప్పటి రెవెన్యూ అధికారులు అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పట్లో వెనక్కి తగ్గిన టీడీపీ నాయకులు... కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే వారి కన్ను మళ్లీ ఈ భూమిపై పడింది. ఇటీవల రాత్రికి రాత్రే ఓ టీడీపీ నాయకుడు ఆ భూమిని జేసీబీలతో చదును చేసి స్వాధీనం చేసుకున్నాడు. భూ రికార్డులను మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ కబ్జా పర్వంపై టీడీపీలోని మరో వర్గం పెద్ద ఎత్తున ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతోంది.
- పుంగనూరు పట్టణ ప్రజల కోసం జాతీయ రహదారి వెంబడి సర్వే నంబర్ 225/6లో 17 సెంట్ల భూమిని ఇండోర్ స్టేడియం కోసం 2004లో ప్రభుత్వం కేటాయించింది. ఇందులో రూ.80 లక్షలు ఖర్చు చేసి ఇండోర్ స్టేడియం నిర్మించారు. ఈ స్టేడియాన్ని టీడీపీ నేతలు జూన్ 7వ తేదీ అర్ధరాత్రి జేసీబీలతో కూల్చివేసి, ఆక్రమించుకున్నారు. ఈ స్థలం విలువ సుమారు రూ.2 కోట్లు ఉంటుంది. దీనిపై రెవెన్యూ, పోలీసు అధికారులు ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి, శాంతినగర్ సమీపంలో సర్వే నంబర్ 407, 408లో 2.50 ఎకరాల్లో వైఎస్సార్–జగనన్న కాలనీ ఏర్పాటు చేసి 83 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇక్కడ ఇళ్లు పునాదుల దశలో ఉండగా ఇటీవల టీడీపీ నేతలు జేసీబీలతో వాటిని పూర్తిగా తొలగించి ఆక్రమించారు.
- పిచ్చిగుండ్లపల్లి రహదారిలో సర్వే నంబర్లు 336, 337, 342లో 10.55 ఎకరాల భూమిని జగనన్న కాలనీకి కేటాయించి 462 మందికి పట్టాలు పంపిణీ చేశారు. ఈ స్థలంలో 6 ఎకరాల భూమిని టీడీపీ నాయకులు చదును చేసి కబ్జా చేశారు.
- రాగానిపల్లి సమీపంలో బైపాస్ రోడ్డు వద్ద సర్వే నంబర్లు 71, 73, 74లో 23.14 ఎకరాలను పేదల ఇళ్ల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ భూమిలో 3 ఎకరాలను ఇటీవల కబ్జా చేశారు. సరిహద్దు రాళ్లను తొలగించేశారు. ఈ భూముల విలువ రూ.10 కోట్లకు పైగా ఉంటుంది.



పుంగనూరులో గతంలో ఉన్న ఇండోర్ స్టేడియం (ఫైల్)



పుంగనూరులో టీడీపీ నేతలు కూల్చివేసిన ఇండోర్ స్టేడియం



పుంగనూరు శాంతినగర్‌లో జేసీబీలతో చదును చేసిన జగనన్న కాలనీ లేఅవుట్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో అర్చకుడి మృతి


కల్యాణ్‌గౌతమ్(ఫైల్)

బైరెడ్డిపల్లె: కర్ణాటక రాష్ట్రం కోలార్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అర్చకుడు మృతి చెందాడు. బైరెడ్డిపల్లె కురవీధికి చెందిన తిప్పాచార్యులు కుమారుడు కళ్యాణ్ గౌతమ్ (25) అర్చక వృత్తిని నిర్వహిస్తున్నాడు. బైరెడ్డిపల్లె కోదండరామస్వామి ఆలయంలో సోమవారం పూజలు చేసి, అక్కడి నుంచి ద్విచక్రవాహనంలో కోలార్ వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీ కొంది. దీంతో తీవ్రంగా గాయపడిన కళ్యాణ్‌గౌతమ్‌ను బెంగళూరు మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కళ్యాణ్ గౌతమ్ మృతితో బైరెడ్డిపల్లెలో విషాచాయలు అలుముకున్నాయి.

డ్రంక్ అండ్ డ్రైవ్..10 మందికి రూ.లక్ష జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన పది మందికి రూ.లక్ష జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం పది మందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

మొగిలి ఘాట్‌లో లారీల ఢీ



బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్‌లో మంగళవారం మూడు లారీలు ఢీకొన్నాయి. వివరాలిలావున్నాయి. పలమనేరు వైపు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న ఓ లారీ బ్రేక్ ఫైల్ కావడంతో మొగిలి ఘాట్‌లో చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల వద్ద ముందు వెళుతున్న లారీలను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు.


గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఎస్.సునీల్‌కుమార్ (29), జి.గౌస్‌భాష (34) అనే ఇద్దరు నిందితులను వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సీఐ జయరామయ్య కథనం మేరకు.. చిత్తూరు నగరంలోని మిట్టూరు పీజీఆర్ లైన్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని తనిఖీ చేశారు. నిందితుల వద్ద ఉన్న ద్విచక్రవాహనంలో కొన్ని సంచులు లభించాయి. వాటిని పరిశీలిస్తే.. అవి గంజాయి పొట్లాలుగా గుర్తించారు. దీంతో నిందితుల నుంచి 6.2 కిలోల గంజాయి, స్కూటర్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. నిందితులను అరెస్టు చేసి, మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా రిమాండుకు ఆదేశించారు.

పాడి పరిశ్రమే

కుప్పంలోని రమణయ్య నాలుగు ఆవులను పోషిస్తూ జీవనం సాగిస్తున్నాడు. వాటి పోషణకు చేతిలే నగదు లేక అప్పు చేసేందుకు సిద్ధమయ్యాడు. ఆ సమయంలో పాడి రైతులకు బ్యాంకుల్లో పావలా వడ్డీకే రుణాలిస్తారని ఎవరో చెప్పడంతో బ్యాంకుకు వెళ్లాడు. తనకు పావలా వడ్డీకి రుణం ఇవ్వాలని అధికారులను కోరాడు. ఆయన వివరాలన్నీ సేకరించిన బ్యాంకు అధికారులు పూచీకత్తు పెట్టిస్తే రుణం ఇస్తామని మెలిక పెట్టారు. పూచీకత్తు ఎవరు పెడతారని ఆ రైతు ఆవేదనతో వెనుదిరిగాడు.



పాడి, పంటలు జిల్లాలోని రైతులకు రెండు కళ్లు లాంటివి. అంత ప్రాముఖ్యం ఉన్న పాడి పశుపోషణ నేడు కర్షకుడికి కష్టంగా మారింది. కారణం పాడి పరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అటకెక్కడమే.. పాడి రైతులను ఆదుకోవాలన్న సదుద్దేశంతో అమలు చేసిన కిసాన్ క్రెడిట్ కార్డులు, వడ్డీలేని స్వల్ప వడ్డీ రుణాలు మంజూరు కాక ఇక్కట్లు పడుతున్నారు.

గ్యారెంటీ ఉంటేనే పాడి రైతులకు రుణాలు

- రైతులకు తప్పని తిప్పలు
- మూగజీవాల పోషణకు అష్టకష్టాలు
- కలెక్టర్ ఆదేశాలు భేఖాతర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పాడి రైతులకు పశువుల పోషణకు బ్యాంకుల్లో పావలా వడ్డీకే రుణాలిచ్చే ప్రక్రియకు బ్యాంకర్లు మోకాలడ్డుతున్నారు. ఏమి చేయాలో పాలుపోక పాడి రైతులు అవస్థలు పడుతున్నారు. మార్కెట్‌లో పశువుల దాణా, మేత ధరలకు రెక్కలొచ్చాయి. దీనికితోడు పంట సాగు కోసం చేతిలో నగదుతోపాటు అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పాడిరైతుల పశుపోషణ కష్టంగా మారింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పశు కిసాన్ క్రెడిట్ కార్డులు (పీకేసీసీ)తో న్యాయం జరుగుతుందని భావించారు. తీరా చూస్తే జిల్లాలోని బ్యాంకర్లు పెడుతున్న ఆంక్షలకు పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

జిల్లా సమాచారం

పథకం పేరు	పశు కిసాన్ క్రెడిట్ కార్డు (పీకేసీసీ)
అధికారుల లక్ష్యం	3,606
అందిన దరఖాస్తులు	1,835
మంజూరు చేసినవి	106

లక్ష్యం ఘనం...అమలులో అన్యాయం

జిల్లాలో పశుకిసాన్ క్రెడిట్ కార్డుల మంజూరు లక్ష్యం ఘనంగా ఉన్నప్పటికీ అమలులో పాడి రైతులకు న్యాయం చేయడం లేదు. జిల్లాలో 3,606 పశు కిసాన్ క్రెడిట్ కార్డులు మంజూరు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. నెలలు గడుస్తున్నప్పటికీ ఆ లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. 3,606 కార్డులకుగాను ఇప్పటివరకు 1,835 మంది పాడి రైతులు కార్డుల కోసం దరఖాస్తులను చేసుకున్నా రు. సంబంధిత పశు సంవర్ధక శాఖ అధికారులు ఆ దరఖాస్తులను ఆమోదం కోసం లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు పంపారు. 1,835లో కేవలం 106 మాత్రం మంజూరు చేసి చేతులు దులుపుకున్నారు. కూటమి చెప్పేదొకటి చేసేది మరొకటని అంటున్నారు.



నిబంధనలు ఏం చెబుతున్నాయి

- ఎలాంటి పూచీకత్తు లేకుండా ఒక రైతుకు రూ.30 వేల నుంచి గరిష్ఠంగా రూ.1.60 లక్షల వరకు పశుపోషణ, మూగజీవాల పోషణకు పావలా వడ్డీకే బ్యాంకర్లు రుణాలు ఇవ్వాలి.
- ఒక పాడి గేదె ఉన్న రైతుకు రూ.30 వేలు, ఐదు గేదెలు ఉన్న రైతుకు రూ.1.50 లక్షలు ఇవ్వాల్సి ఉంది. మేకలు, గొర్రెల పెంపకందారులకూ ఇదే తరహాలో రూ.30 వేల నుంచి రూ.1.60 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించాలి.
- బ్యాంకు నుంచి రుణం తీసుకున్న పాడి రైతులు, మేకలు, గొర్రెల పెంపకందారులు ఏడాదిలో రుణ చెల్లింపులు చేస్తే కేంద్రం 3 శాతం వడ్డీ రాయితీ ఇస్తుంది.

దరఖాస్తులు బుట్టదాఖలు

పీకేసీసీ కార్డుదారులకు రుణాలు ఇవ్వాలని గత నాలుగైదు నెలలుగా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ బ్యాంకర్లను ఆదేశిస్తున్నారు. 3,606 దరఖాస్తులను బ్యాంకులకు పంపారు. పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది బ్యాంకర్లతో మాట్లాడి వారిని ఒప్పించి రుణాలు ఇప్పించాలి. బ్యాంకులకు దరఖాస్తులు పంపి చేతులు దులిపేసుకుంటున్నారు. కుప్పం, పుంగనూరు, నగరి, పలమనేరు, జీడీ నెల్లూరు నియోజకవర్గాల్లో పీకేసీసీ కార్డులపై కనీస అవగాహన కల్పించడంలో పశుసంవర్ధక శాఖ అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

ఉపయోగాలున్నా లాభం శూన్యం

పీకేసీసీ కార్డులతో సొమ్ము అవసరమైనప్పుడల్లా నగదు తీసుకోవచ్చు. ఆ సొమ్మును నలభై రోజుల్లోగా తిరిగి చెల్లిస్తే ఎలాంటి వడ్డీ ఉండదు. 40 రోజులు దాటాక ఏడాది లోపు చెల్లిస్తే 7 శాతం వడ్డీ వసూలు చేస్తారు. ఇందులో 3 శాతం కేంద్రం వడ్డీ రాయితీ ఇవ్వనుంది. మిగిలిన నాలుగు శాతం రైతు చెల్లించాల్సి వస్తుంది. ఇలా కార్డులను సక్రమంగా వినియోగించుకుంటే ఎలాంటి వడ్డీ భారం లేకుండానే ఆర్థిక అవసరాలు తీర్చుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేయవచ్చు. అయితే ఈ కార్యక్రమం మొత్తం కూటమి సర్కారు పబ్లిసిటీ కోసం మాత్రమే చేస్తోందని, క్షేత్రస్థాయిలో పాడి రైతులకు ఎలాంటి న్యాయం జరగడం లేదనే ఆరోపణలున్నాయి.

పూచీకత్తు అడుగుతున్నారు ఏం చేయాలి



అధికారులేమో ఎలాంటి పూచీకత్తు అవసరం లేదంటున్నారు. బ్యాంకుకు వెళ్తేనేమో పూచీకత్తు కచ్చితంగా ఉండాలంటున్నారు. మేమేం చేయాలి. మమ్మల్నెందుకు ఇలా ఇబ్బంది పెడతారో అర్థమే కావడం లేదు. ఏదో చేస్తామని చెబుతారు తీరా ఏమి చేయరు. పీకేసీసీ కార్డు కోసం తిరిగి తిరిగి అలిసిపోయాం. ఇంత వరకు ఆ కార్డే ఇవ్వలేదు. ఇంక రుణమేమిస్తారు మాకేమో నమ్మకం లేదు.

– జైలా, పాడి రైతు, ముదిపల్లి, నగరి మండలం

అప్పులే శరణ్యం



ప్రభుత్వం తరపున ఎలాంటి సహాయం అందడం లేదు. పాడి రైతులకు మేలు చేస్తామని నాయకులందరూ గొప్పలు చెబుతున్నారే తప్ప ఎలాంటి న్యాయం మాకు జరగడమే లేదు. అప్పు చేసి రెండు ఆవులు కొని పోషించుకుంటున్నాం. రుణమేదో ఇస్తామన్నారు. బ్యాంకు దగ్గరకు పోయి అడిగితే అలాంటిదేమి ఇవ్వరూ వెళ్లిపోండి అని కసురుకుంటున్నారు. ప్రభుత్వం తరపున ఎలాంటి న్యాయం జరగకపోవడం వల్ల అప్పులే మాకు శరణ్యం.

– విజయబాబు, పాడిరైతు, గంగాధరనెల్లూరు మండలం

దేహ దారుఢ్య పరీక్షల్లో 192 మంది అర్హత


ఈవెంట్స్‌లో పాల్గొంటున్న మహిళా అభ్యర్థులు

చిత్తూరు అర్బన్: నగరంలో జరుగుతున్న కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించిన దేహదారుఢ్య పరీక్షల(ఈవెంట్స్)లో మంగళవారం 192 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులకు జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో జరుగుతున్న దేహదారుఢ్య పరీక్షలను (ఈవెంట్స్)ను సత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న పర్యవేక్షించారు. 610 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 379 మంది హాజరయ్యారు. వీరిలో 192 మంది తదుపరి రాత పరీక్షలకు అర్హత సాధించారు.

జోనల్ అథ్లెటిక్స్ మీట్ ప్రారంభం


పుదిపట్లలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓలు

చౌడేపల్లి: పుంగనూరు జోనల్ స్థాయి అథ్లెటిక్స్ మీట్ క్రీడా పోటీలను మండలంలోని పుదిపట్లలో సోమవారం ఎంఈఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. జోనల్ క్రీడాపోటీలకు పుంగనూరు జోన్ పరిధిలోని ఆరు మండలాల నుంచి క్రీడాకారులు హాజరై పోటీల్లో తలపడ్డారు. సీనియర్ బాలురు, బాలికలు, జూనియర్ బాలురు, బాలికలకు వేర్వేరుగా 100 మీటర్లు, 200, 400 మీటర్లు పరుగుపందెంతోపాటు , షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్ పోటీలను నిర్వహించారు. మంగళవారం ఫైనల్ విజేతలను వెల్లడించనున్నట్లు ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంసీసీ కమిటీ వైస్ చైర్మన్ ఉదయ్‌కుమార్‌రెడ్డి , బాబురెడ్డి, లాజర్, వినోద్‌కుమార్‌రెడ్డి, హెచ్ఎం పద్మజ, విశ్రాంత పీడీ రామచంద్ర, పీడీలు రాజేంద్ర, వెంకటేష్, కరుణాకర్, నితిన్, చిన్నప్ప, ఉమ, శారద, నీలవేణి, మృదుల తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌జిల్లా కబడ్డీ పోటీల్లో
జిల్లాకు మూడో స్థానం


అంతర్‌జిల్లా కబడ్డీ పోటీల్లో పుంగనూరు చెందిన క్రీడాకారులు

పుంగనూరు:అంతర్‌జిల్లా కబడ్డీ పోటీల్లో చిత్తూరు జిల్లా బాల, బాలికల జట్లు మూడో స్థానం దక్కించుకున్నట్లు క్రీడా విభాగం జిల్లా కార్యదర్శి గంగాధర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కర్నూలులో 3వ తేదీ నుంచి 50వ జూనియర్ బాలబాలికల పోటీల్లో బాల, బాలికల జట్లలో పుంగనూరు తదితర ప్రాంతాలకు చెందిన క్రీడాకారులకు మూడో స్థానం లభించిందన్నారు. వీరిలో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన గణేష్, కార్తీక్, బాలికల విభాగంలో లిఖిత, నేత్ర రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. క్రీడాకారులను పలువురు అభినందించారు.

కులగణన అభ్యంతరాల గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్ : ఎస్సీ కులగణనపై అభ్యంతరాల గడువును ఈ నెల 12 వరకు పొడిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ కులగణనపై అభ్యంతరాలు స్వీకరించనున్నట్టు చెప్పారు. అభ్యంతరాలు తెలియజేసేందుకు ఈ నెల 7వ తేదీ వరకు అవకాశం ఉండేదని, గడువు పొడిగింపుతో జిల్లాలోని నిర్దేశిత ప్రాంతాల్లో అధికారులు ప్రజల నుంచి ఐదు రోజులపాటు అభ్యంతరాలు స్వీకరించి, ఆన్‌లైన్‌లో 16వ తేదీ వరకు నమోదు చేస్తారన్నారు. అనంతరం తనిఖీలు పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలను ఈ నెల 20న వార్డు సచివాలయాల్లో విడుదల చేస్తారని వెల్లడించారు. మండల ప్రత్యేక అధికారులు ఈ ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

వేటు పడింది!

సామాన్యులకు రక్షణ కల్పించాల్సిన ఏఎస్‌ఐలే దారి తప్పుతున్నారు. క్రమశిక్షణ రాహిత్యం వహించిన వారిపై వేటు పడింది.. ఈ క్రమంలో ఎవరైనా సరే గీతదాటితే వేటు తప్పదన్న రీతిలో చిత్తూరు ఎస్పీ వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో నెల వ్యవధిలో ఇద్దరు ఏఎస్‌ఐలు వీఆర్‌కు పంపించారు.

- దారి తప్పుతున్న ఏఎస్‌ఐలు
- నెలలో ఇద్దరు ఏఎస్‌ఐలు వీఆర్‌కు
- గీత దాటితే తాట తీస్తున్న ఎస్పీ


పుంగనూరు పోలీస్‌స్టేషన్


ఏఎస్ఐ దామోదర్


ఏఎస్ఐ చేతిలో దెబ్బలు తిన్న మహబూబ్‌బాషా

పుంగనూరు: సామాన్య ప్రజానికానికి రక్షణ కల్పించాల్సిన పోలీసులు ఓవరాక్షన్ చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం పుంగనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో అధికమైంది. పోలీసులు రాత్రి పూట దుకాణాలు మూసివేసే సమయంలో వ్యాపారులు, సామాన్య ప్రజలను దుర్భాషలాడటం, కొట్టడంతో స్థానికులు భయాందోళనలకు లోనవుతున్నారు. ఈ సంఘటనలు పోలీస్ వ్యవస్థకు తలనొప్పిగా మారింది. దీనిపై జిల్లా ఎస్పీ కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు. ఒక నెల రోజుల వ్యవధిలో ఇద్దరు ఏఎస్‌ఐలను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ మణికంఠ చందవోలు ఆదేశాలు జారీ చేయడం, గీత దాటితే తాటతీస్తాం అనేలా ఎస్పీ తక్షణ చర్యలు తీసుకోవడంతో ప్రజల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని కలిగిస్తోంది. వివరాల్లోకి వెళితే..

పుంగనూరు మండలంలోని నల్లగుట్లపల్లెతాండకు చెందిన గిరిజన కులానికి చెందిన మురళీనాయక్‌ను ఏఎస్ఐ మహేంద్రరావు ఈనెల 4వ తేదీన పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అతడిని కులం పేరుతో దూషించడం వివాదస్పదమైంది. దీనిపై బాధితుడు గత రెండు రోజులుగా జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశాడు. ఈనెల 6వ తేదీన అంబేడ్కర్ విగ్రహం వద్ద తన మైనర్ కుమార్తైతో కలిసి మురళీనాయక్ బైఠాయించి నిరసన తెలిపాడు. ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు ఏఎస్ఐని సస్పెండ్ చేసి, ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలని, లేకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. దీనిపై సీఐ శ్రీనివాసులు బాధితుడితో, కుల సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి, బాధితుడికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం ఏఎస్ఐ మహేంద్రరావును వీఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ మణికంఠ చందవోలు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సీఐ శ్రీనివాసులు ఏఎస్ఐని రిలీవ్ చేశారు. కాగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించే వారెవరైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ ఘాటుగా వ్యాఖ్యానించినట్లు తెలిసింది.



పుంగనూరులో ఏఎస్ఐ మహేంద్రరావుపై చర్యలు తీసుకోవాలని దీక్ష చేస్తున్న మురళీనాయక్(ఫైల్)

డిసెంబర్ 2న ఓ ఏఎస్ఐ వీఆర్‌కు...

ఓ డబ్బు లావాదేవి కేసులో ఏఎస్ఐ దామోదరం కోళ్ల వ్యాపారి మహబూబ్‌బాషాను స్టేషన్‌కు పిలిపించి, దుర్భాషలాడుతూ కొట్టడంతో ముస్లింలు ఆందోళన చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించడంతో సీఐ శ్రీనివాసులు బాధితులతో చర్చలు జరిపి, విచారణ చేపట్టి, నివేదికలను ఎస్పీకి పంపారు. ఎస్పీ మణికంఠ చందవోలు డిసెంబర్ 3వ తేదీన ఏఎస్ఐ దామోదర్‌ను వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు జారీ చేశారు. కాగా నెల రోజుల వ్యవధిలో ఏఎస్ఐలు ఇద్దరు వీఆర్‌కు వెళ్లడం చర్చనీయాంశమైంది.

అనుమానాస్పద స్థితిలో సివిల్స్ విద్యార్థి మృతి


సునీల్ (ఫైల్)

శాంతిపురం: ఢిల్లీలోని ఓ ప్రైవేటు విద్యాసంస్థలో సివిల్స్ కోచింగ్ కోసం వెళ్లిన విద్యార్థి అనుమానాస్పద స్థితిలో అక్కడే మృతి చెందాడు. మండలంలోని కెనమాకులపల్లి పంచాయతీలోని వెంకటేపల్లికి చెందిన హరీష్ కుమారుడు సునీల్ ఢిల్లీలో సివిల్స్ కోచింగ్‌కు వెళ్లాడు. అక్కడే ఓ పీజీలో ఉంటూ చదువుకుంటున్నాడు. సునీల్ అనారోగ్యంతో ఉన్నాడని సోమవారం పీజీ నిర్వాహకుల నుంచి ఫోను రావడంతో తండ్రి, బంధు వులు మంగళవారం ఢిల్లీ వెళ్లారు. అప్పటికే మృతి చెందిన సునీల్ మృతదేహాన్ని ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతదేహాన్ని చూసిన మృతుడి తండ్రి దానిపై గాయాలున్నట్లు గుర్తించి అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా మృతుడు సునీల్ ఇటీవల ఆన్‌లైన్ బెట్టింగ్‌లో రూ.4 లక్షలు అప్పులు చేయడంతో కుటుంబ స భ్యులు గత వారం రూ.2 లక్షలు అతడికి పంపారని బంధువులు చెప్పారు. ఈ నేపథ్యంలో మిగిలిన రూ.2 లక్షల కోసం బెట్టింగ్ ముఠా సునీల్ ప్రాణాలు తీసి ఉంటుందని వారు అనుమానం వ్యక్తం చేశారు.

వెనుకబడిన జిల్లాలకు నిధులు కేటాయించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం గాంధీవిగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గంగరాజు మాట్లాడుతూ విభజన చట్టంలో ఉన్న అంశాలను అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రధాని పర్యటనను నిరసిస్తున్నామన్నారు. పదేళ్లుగా రాష్ట్ర విభజన హామీలు అమలు చేయడం లేదన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు నిధు లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు సుమారు రెండేళ్లుగా కార్మికులు, ప్రజలు పోరాడుతు న్నారన్నారు. కడప స్టీల్ ప్లాంట్ కేంద్ర ప్రభు త్వ పరిశీలనలో లేదని, ఆంధ్రలో ప్రధా ని పర్యటించడం తెలుగువారి ఆత్మాభిమానాన్ని దెబ్బతీయడమేనని విమర్శించారు. బీజేపీ గతంలో రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించిందన్నారు. ఆ అంశం ఇప్పుడు తమకు సంబంధం లేదని చెప్పడం సరికాదన్నారు. రాష్ట్రంలోని ఓడరేవులు, రోడ్లు, రైల్వే లైన్లు ఆదాని కంపెనీకి అప్పగించడం పనిగా పెట్టుకుందన్నారు. సోలార్, గాలిమరల విద్యుత్ ఉత్పత్తి పేరుతో రాయలసీమలోని వేల ఎకరాల భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తుందన్నారు. ఇన్ని రకాలుగా ఆంధ్ర ప్రజలను దగా చేస్తున్న బీజేపీని నిలదీయాల్సిన టీడీపీ, జనసేన వారి సేవలో తరిస్తుందన్నారు.

పోలీసులకు బకాయిలు ఇవ్వాలి

పోలీసులకు బకాయి ఉన్న అన్ని రకాల బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు. టీఏ, డీఏ, సరెండర్ లీవుల బకాయిల చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పోలీసుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లా నాయకులు ఓబుల్‌రాజు, గిరిధర్‌గుప్త, భువనేశ్వరి, చిలకమ్మ, రాజా, జయంతి పాల్గొన్నారు.